179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెక్టార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

వేలం వేసిన ఖనిజాల వివరాలు

ఖనిజం	వేలం వేసిన బ్లాకులు	టీక్యూబీల సంఖ్య	రిజర్వు ధర (రూ.)	తుది బిడ్ మొత్తం (రూ.)
కలర్ గ్రానైట్	1	5	29,04,000	4,99,79,000
లాటరైట్	4	39	63,33,600	15,89,58,600
స్టోన్ అండ్ మెటల్	14	84	4,71,25,000	35,84,75,000
మొత్తం	19	128	5,63,62,600	56,74,12,600

గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

పారిశ్రామికానికి బీటలు

ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

నూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఢీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

ఢీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్యాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

కీలక రంగాలది అదే దారి

కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.

	ఏప్రిల్-2025	ఏప్రిల్-2024
పారిశ్రామిక ప్రగతి	2.7%	5.2%
తయారీరంగ వృద్ధి	3.4%	4.2%
గనుల రంగ వృద్ధి	-0.2%	6.8%
విద్యుత్ రంగం	1%	10.2%
ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం	4%	8.5%
ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్	-0.4%	7%

రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకా నుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టినేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్‌ఇండ్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్‌ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాము పొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంధ్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం

న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టేవారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

శ్రీరాంపూర్ ఓసీపీ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్, మే 28 : శ్రీరాంపూర్ ఓసీపీపై బుధవారం టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ ఓసీపీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పాల్గొని నూతన పిట్ కమిటీని నియమించారు. శ్రీరాంపూర్ ఓసీపీ టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శిగా గడ్డం సుధాకర్(ఈపీ ఆపరేటర్), సహాయ కార్యదర్శిగా జంగం రమేశ్ (ఫిట్టర్), జనరల్ షిఫ్ట్ సెక్రటరీగా రామగిరి సంపత్, అంతల వెంకన్న (జనరల్ అసిస్టెంట్), ఏరిలే కార్యదర్శి పెట్టం సారయ్య(ఈపీ ఆపరేటర్), బీ రిలే కార్యదర్శి కుడుక సత్యనారాయణ(ఈపీ ఆపరేటర్), సీ రిలే కార్యదర్శిగా ముద్దసాని స్రవంతి, సహాయ కార్యదర్శులుగా అక్షయ, హేమలత, ఎంవీ డ్రైవర్స్ ఇంచార్జులుగా శ్యాంకుమార్, తిరుపతి, బ్లాస్టింగ్ సెక్షన్ ఇన్‌చార్జిలుగా మేకల రవి, ఇప్ప వెంకటేశ్, జలంధర్‌తో పాటు 26 మంది కార్యవర్గ సభ్యులను, 53 సమితి సభ్యులను నియమించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు పోతు ఆంజనేయులు, మాజీ ఏరియా సెక్రటరీ మహిపాల్ రెడ్డి, పెట్టం వినోద్, మారం శ్రీనివాస్, అగ్గు తిరుపతి, నిఖిల్, బుర్ర శ్రీనివాస్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో ఎన్నికైన పిట్ కమిటీ సభ్యులతో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

రోస్టర్ ప్రకారమే ఉద్యోగోన్నతులు

మందమర్రి, మే 28: సింగరేణిలో రోస్టర్ ప్రకారమే అన్ని రకాల ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు సింగరేణి కార్పొరేట్ జీఎం ఎస్సీ చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ దుర్గం రాంచందర్ అన్నారు. కార్పొరేట్ ఎస్సీ రోస్టర్ సభ్యులతో కలిసి ఆయన బుధవారం మందమర్రి ఏరియా జనరల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఉద్యోగోన్నతులు ఎస్సీ రోస్టర్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ జీఎం, ఎస్సీ చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ రాంచందర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని రోస్టర్ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైపీఎం లైజనింగ్ ఆఫీసర్ మైత్రేయబందు, మెడికల్ సూపరిండెంట్ రాజేశ్వర్, సీవోపీ అండ్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ కానుకుల తిరుపతి, డీవైపీఎం సత్య బోస్, ఓఎస్ రాయలింగు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాంచందర్

పని దినాలు పెంచితేనే లక్ష్య సాధన

మందమర్రి, మే 28: సింగరేణిలో అన్ని పని దినాలను(ప్లేడే)లను పెంచితేనే 2025-26 ఆర్థిక సంవత్సర నిర్ధేశిత బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని హెచ్ఎంఎస్ నాయకులు అన్నారు. మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు జే.శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి మాట్లాడుతూ ప్లేడేలను నడపడంతో ఉత్పత్తి లక్ష్యంతో పాటు కార్మికుల సంక్షేమం రెండు సాధ్యమవుతాయన్నారు. భావితరాలకు ఉపాధి కల్పించాలంటే ఓపెన్ కాస్టు గనుల పైనే ఆధార పడకుండా భూగర్భ గనులను ప్రారంభించాలని కోరారు. అలాగే ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.40 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో సింగరేణి కార్మికులనే నియమించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, చొప్పరి రామస్వామి పాల్గొన్నారు.

నస్పూర్ ప్రభుత్వ పాఠశాలలో మొక్క నాటుతున్న ఆయూష్ మెడికల్ ఆఫీసర్ పద్మజ

కోటపల్లి : మొక్క నాటుతున్న యోగా సిబ్బంది, స్టాఫ్ నర్సు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీసీసీ నస్పూర్, మే 28: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నస్పూర్ పీహెచ్‌సీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకల్లో భాగంగా నస్పూర్ ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ కన్వీనర్, డీపీఎం రాథోడ్ రవీందర్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు సుధాకర్, మేఘన ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది యోగానాలు చేశారు. ఈ సందర్భంగా వారు యోగా గొప్పదనంపై తెలియజేశారు. యోగాతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వచ్చే నెల 21 యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలు తమ జీవనశైలిని ఉన్నతంగా మార్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 20 రోజుల పాటు యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ పద్మజ, ఫార్మసిస్ట్ పుష్పాంజలి, కిషన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో హరితయోగ..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హరిత యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రాథోడ్ రవీందర్, పాఠశాల హెచ్ఎం దామోదర్, మాజీ సర్పంచ్ గోపాల్‌రావు, తదితరులు పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సుధాకర్, మేఘన, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి మండలంలో..

కోటపల్లి, మే 28: అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా హరిత యోగ కార్యక్రమంలో భాగంగా కోటపల్లి మండల కేంద్రంలోని ఆయూష్మాన్ ఆరోగ్య కేంద్రం యోగ షెడ్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యానికి, దీర్ఘకాలిక రోగాలను నయం చేయడానికి యోగ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ-ఔషధ గుణాలు ఉన్న మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు లట్టి రాజాబాపు, మమత రాణీ, స్టాఫ్ నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి జాగృతి శ్రీరాంపూర్ కన్వీనర్‌గా వికాస్ ఎన్నిక

శ్రీరాంపూర్, మే 28 : సింగరేణిలో నూతనంగా ఏర్పడిన కార్మిక సంఘంగా సింగరేణి జాగృతి ఏర్పడింది. ఈ మేరకు తెలంగాణా జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సింరేణి వ్యాప్తంగా 11 ఏరియాల కన్వీనర్లను నియమించి ప్రకటించింది. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జాగృతి కన్వీనర్‌గా శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గనికి చెందిన కుర్మ వికాస్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ సింగరేణి జాగృతి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కరానికి కవిత నాయకత్వంలో పోరాడుతామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో, టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తనపై విశ్వాసంతో ఎమ్మెల్సీ కవిత సింగరేణి జాగృతి శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్‌గా నియమించడంపై కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఎమ్మెల్సీ కవితతో కుర్మ వికాస్

పత్తి కట్టెను తొలగిస్తున్న కూలీలు

వానకాలం సాగుకు సన్నద్ధం

వాంకిడి, మే 28 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండడంతో రైతులు పొలాల్లో పత్తి కట్టే, గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించడం, దుక్కులు, దున్నడంలో బిజీ బిజీగా ఉన్నారు. అలాగే వర్షాలు ఓ మోస్తారు కురవడంతో భూముల్లో పదన ఉండడంతో దుక్కులు దున్నేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో మాదిరి ఎడ్లు, నాగలి కాడ్వాలు కనుమరుగు అవుతుండడం, యాంత్రీకరణతో ట్రాక్టర్లు ఉపయోగం బాగా పెరిగింది. అందరూ ఒకేసారి దున్నితే ట్రాక్టర్ల కిరాయి పెరుగుతుందేమోనని ముందస్తుగా దుక్కులు దున్నేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

మంచిర్యాలటౌన్, మే 28: తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, నటులు నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను బుధవారం మంచిర్యాలలో ఘనంగా నిర్వహించారు. కమ్మవారి సంక్షేమ సేవాసమితి ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్ధన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, సేవాసమితి గౌరవ అధ్యక్షుడు కారసాల ప్రసాదరావు, అధ్యక్షుడు పోలినేని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మండవ తాతారావు, కోశాధికారి గంగినేని జనార్ధన్‌రావు, ఉపాధ్యక్షులు సూరపనేని అర్జున్‌రావు, మక్కామల జగదీశ్ పాల్గొన్నారు. కమ్మసేవా సమితి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శ్రీరాంపూర్, మే 28: మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతిని శ్రీరాంపూర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి బోడ జనార్దన్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, పట్టణ కార్యదర్శి మేరుగు పవన్ వివిధ పార్టీలకు చెందిన నాయకులు శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కమ్మ వారి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కమ్మవారి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జనార్ధన్, నాయకులు

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

మందమర్రి, మే 28: సింగరేణి మందమర్రి ఏరియాలోని సింగరేణి ఎన్ సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించేందుకు బుధవారం పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు 97 క్వార్టర్లను ప్రకటించగా 77 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రకారం 21 మంది ఉద్యోగులకు క్వార్టర్‌లను కేటాయించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం రవీందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు, ఓఎస్ రాయలింగు పాల్గొన్నారు.

మందమర్రిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గ్యాస్ వినియోగదారులకు ఈ -కేవైసీ పై అవగాహన

మందమర్రి, మే 28: ఇండియన్ గ్యాస్ వినియోగదారుల ఈ కేవైసీ పై సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు అవగాహన కల్పించారు. మందమర్రి పట్టణంలోని మార్కెట్‌లో సింగరేణి సూపర్ బజార్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేసుకోవాలని అందుకు ఇంటికి వద్దకు వచ్చే తమ సిబ్బందికి సహకరించాలన్నారు. వినియోగదారులు కాలపరిమితి ముగిసిన గ్యాస్ పైపులను మార్చుకోవాలని లేదంటే ప్రమాదాలు సంభవిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సూపర్ బజార్ బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్, ఎల్‌పీజీ కోఆర్డినేటర్ రాజు, గ్యాస్ డిస్